# మా రోజుల్లో...

నా చిన్నప్పుడు మా అమ్మమ్మ అంటుండేది 'మారోజుల్లో ఇలా వుండేదా. పిదపకాలం పిదప బుద్ధులూనూ' అని.

నేను విఠలాచార్య సినిమాకి వెడుతున్నా, హిందీ సినిమాల్లో హెలెన్ డాన్సులు చూస్తున్నా, మా మామయ్య అనేవాడు 'ఎందుకురా ఆ పిచ్చివన్నీ చూస్తావ్. చక్కటి పుస్తకం ఏదన్నా చదువుకోరాదూ' అని.

చక్కటి పుస్తకాలు చదువుకుంటూనే, అవీ చూస్తుండేవాడిని.

ఈమధ్యనే అమెరికాకి వచ్చిన కుర్రాళ్ళు ఏవన్నా కొత్త తెలుగు సినిమాలు చూడటానికి వెడుతూ, వస్తారా అని అడుగుతుంటారు.

'మా రోజుల్లో..' అని మొదలుపెట్టకపోయినా, 'ఆ చౌకబారు సాహిత్యం, వయొలెన్స్, సెక్స్ నేను భరించలేను. నన్ను వదిలేయండి' అని తప్పించుకుంటాను.

0 0 0

ఈమధ్య 'మాగల్యం తంతునా' గురించి కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు, కాలిఫోర్నియా సుందర్ ఆస్టిన్ వచ్చినప్పుడు మా ఆవిడ ఒక చిన్న పార్టీ ఇచ్చిందనీ, అప్పుడు మేమందరం అమెరికా వచ్చిన కొత్తల్లో ఎలా ఇక్కడ భూమి మీద కాళ్ళు పెట్టామో చెప్పుకున్నామని చెప్పాను. ఈసారి ఆ విషయం చూద్దాం.

కొత్తగా అమెరికా వచ్చిన కుర్రాడు అర్జున్ సుబ్బరామయ్యగారిని అడుగుతున్నాడు 'మీరు 1960వ దశకంలో అమెరికాకి వచ్చారంటున్నరు కదా... ఆ రోజుల్లో ఇక్కడ మీకు ఎలా వుండేది' అని.

సుబ్బరామయ్యగారికి శ్రోతలు కావాలి. నోరున్నా లేకపోయినా, వాళ్ళకి పెద్ద చెవులుంటే చాలు. పెద్ద చెవులు లేకపోయినా అడిగినవాడు అర్జునుడు కనుక, ఆయనకి అవకాశం దొరికింది మరి.

'ఆ రోజుల్లో మనవాళ్ళు ఎక్కడ పడితే అక్కడ కనపడేవాళ్ళు కాదు. హ్యూస్టన్‌లాటి పెద్ద నగరాల్లోనే, ఇండియన్లు ఎక్కడయినా కనపడితే అదో అదృష్టం. ఒక వూరినించీ ఇంకో వూరికి ఫోన్ చార్జీలు కూడా మాకు తలకు మించి వుండేవి. అందుకని ఇండియన్స్‌కోసం ఎదురుచూస్తూ వుండేవాళ్ళం. తెలుగువాళ్ళు కనపడటం ప్రపంచ అద్భుతాల్లో ఒకటిగా చెప్పుకునేవాళ్ళం'

'మరి మీకు ఇండియన్ రెస్టారెంట్లూ.. గ్రోసరీ... ' అడిగాడు మోహన్. అతనూ ఈ మధ్యనే హెచ్ వన్ వీసా మీద అమెరికా వచ్చాడు.

నవ్వాడు సుబ్బరామయ్య. 'అలాటివేమీ లేవు. ఎక్కడో న్యూయార్కులోనో చికాగోలోనో వుండేవి. చైనీస్ షాపుల్లో బియ్యం దొరికేది. కందిపప్పు బదులు లెంటెల్స్ తెచ్చుకుని దానితో పప్పు చేసుకునేవాడిని. పప్పులోకి టొమాటోలు. రోజూ అవే తిని బోరుకొడితే ఏ ఆకులు దొరికితే అవి - సెల్లరీ, స్పినాచ్, రుబాబ్ ఏదయి తేనేం... బలుసాకులు పప్పులో వేసుకుని తినేవాడిని. పెరుగూ దొరికేది కాదు. పాలు

దొరికినా తోడు పెట్టటానికి తోడు ఇచ్చే తోడు లేని వూరు. అందుకని అన్నంలో పెరుగు బదులు పాలు పోసుకు తినేవాడిని. మన పోపు సామానులూ దొరికేవి కాదు. ఇటాలియన్ ఒరెగానో, పార్స్లీ.. ఏం దొరికితే అదే మా పోపు సామాను...'

'మీరు శాకాహారులు కదా.. ఇంట్లో బోరు కొడితే, బయట రెస్టారెంట్లలో ఏవయినా దొరికేవా?' అని అడిగింది మోహన, మోహన్ భార్య.

'ఈ రోజుల్లోలా ఎప్పుడో కానీ బయట తినేవాళ్ళం కాదు. ఒకటి మా స్టూడెంట్ జేబులు ఖాళీగా వుండే రోజులే ఎక్కువ. కాంపస్ ఉద్యోగాలూ, బయట అవకాశాలు ఈ రోజుల్లోలా వుండేవికావు. ట్యూషన్‌కీ పుస్తకాలకీ సరిపడా సంపాదించుకొని, కాస్త తల దాచుకుని పొట్ట నింపుకోగలిగితే అంతకన్నా భాగ్యమూ సౌభాగ్యమూ లేవు. శాకాహారం అంటూ ఈరోజుల్లోలా ఏవీ దొరికేవి కావు బయట. ఏ సలాడో తినాలంటే, మనవేపు మేకలు గుర్తుకొచ్చేవి. అదీకాక తెలుపూ నలుపుల గొడవ ఒకటి. ఇండియాలో పంచమ కులాలవారిని అగ్రకులాలు అణగదొక్కటం చూసే వాళ్ళం. భూస్వాములు పనివాళ్ళని సాటిమనష్యులుగా చూడకపోగా హీనంగా చూడటం, చంపేయటం, పూజారులు గుడిలోకి రానివ్వకపోవటం మనకి ఆరోజుల్లో ఇండియాలో సర్వసాధారణం. కాని అక్కడి అదే అగ్రజాతివారు, ఇక్కడ అమెరికాలో అగ్రవర్ణమైన తెల్లవారి చేత హీనంగా చూడబడటం..... నాలాటి భౌతికవాదులకు కుతూహలంగా వుండేది!' ఆయన చెప్పటం ఆపాడు.

'మరి అమెరికన్స్ మిమ్మల్ని ఏక్సెప్ట్ చేసేవాళ్ళా?' అడిగాడు అర్జున్.

'లేదు. నేను అమెరికా వచ్చిన సమయంలోనే మార్టిన్ లూథర్ కింగ్ మొదలైన వారి ఆందోళన, ఎక్కడ చూసినా తెల్లవాళ్ళూ నల్లవాళ్ళూ ఒకళ్ళమీద ఒకళ్ళు కాలు దువ్వటం... అందులోనూ నేను అట్లాంటాలో పిహెచ్‌డీ చేస్తుండే వాడిని. మార్టిన్ లూథర్ కింగ్ అక్కడివాడే నేను చదువుకుంటున్నప్పుడే ఇటు కెన్నెడీ, అటు కింగ్ హత్య చేయబడ్డారు' ఆయన ఒక్క క్షణం ఆగి మళ్ళీ మొదలుపెట్టాడు. 'మీకో చిన్న సంఘటన చెబుతాను. నా చదువు అయిపోగానే, ఆస్టిన్‌లోనే నాకు మొదటి ఉద్యోగం దొరికింది. ఒంటరిగాణ్ణి. హ్యూస్టన్‌లో నారాయణరావుగారని, మన తెలుగువాడే ఒక మంచి మిత్రుడుండేవారు. వీలు దొరికినప్పుడల్లా రెండొందల మైళ్ళు కారులో వెళ్ళి ఆయనతో కొన్ని గంటలు గడిపేవాడిని. ఒకసారి అలా వెడుతూనే దారిలో పెట్రోలు కావలసి ఒక పల్లెటూళ్ళో ఆగాను. ఆ షాపు ఒక తెల్ల అతనిది. డబ్బులిచ్చాను కనుక పెట్రోలయితే ఇచ్చాడు కానీ, నన్ను టాయిలెట్ వాడుకోవటానికి అనుమతివ్వలేదు. అది తెల్లవాళ్ళకి మాత్రమేనని అక్కడ బోర్డుంటే దాన్ని చూపించాడు. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడానో చూశారుగా' అంటూ ఆ రోజుల్లోకి వెళ్ళిపోయాడేమో, మౌనంగా ఆలోచిస్తున్నట్టున్నాడు.

అక్కడి వాతావరణాన్ని కొంచెం తేలికపరచటం కోసం నాతో సుందర్ అన్నాడు 'మీరు మొట్టమొదట అమెరికా వచ్చినప్పుడెలావుంది?' అని అడిగాడు.

నేను నవ్వుతూ అన్నాను 'నేను వచ్చి పాతికేళ్ళేకదా అయింది. సుబ్బరామయ్యగారి రోజులు వేరు.. మా రోజులు వేరు .... ' అన్నాను.

మోహన్ చిరునవ్వుతో అన్నాడు 'సుబ్బరామయ్యగారి రోజుల కథ విన్నాం కదా.. మీ రోజులు మా రోజుల కన్నా ఒక తరం ముందున్నాయి. ఫరవాలేదు చెప్పండి' అని.

'మేము అమెరికా వచ్చేసరికీ మనవారి జీవితవిధానంలో చాల మార్పులు వచ్చాయి. ఎక్కడపడితే అక్కడ ఇండియన్ షాపులూ రెస్టారెంట్లూ లేవు కానీ, హ్యూస్టన్‌లాటి పెద్ద వూళ్ళల్లో వుండేవి. మేము ఆస్టిన్ వచ్చినా కూడా సరుకుల కోసం నెలకోసారి హ్యూస్టన్ వెళ్ళేవాళ్ళం. చైనీస్ షాపుల్లో బియ్యం దొరికేది కానీ అక్కడ ఎండు చేపల వాసన. అందుకని ఆ ఛాయలకే వెళ్ళేవాళ్ళం కాదు. కొన్ని పెద్ద వూళ్ళల్లో, ముఖ్యంగా యూనివర్సిటీలున్న పెద్ద వూళ్ళల్లో, ఇండియన్స్ అంటే అంత కొత్తవాళ్ళలా చూసేవాళ్ళు కాదు. నాకూ అయిందొక చిన్న అనుభవం.... ' అన్నాను.

అర్జున్ 'అయితే చెప్పండి మరి' అన్నాడు కొంచెం ముందుకి జరుగుతూ.

'హ్యూస్టన్‌కి వంద మైళ్ళ దూరంలో ఒక చిన్న వూరు వుంది. అక్కడ ఒక చిన్న కంపెనీలో నాకు ఇంజనీరింగ్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. మరీ చిన్న కంపెనీ కనుక, పెట్రోకెమికల్ రంగంలో అవసరమైన పరికరాలు డిజైన్ చేయటం దగ్గరనించి, వాటి తయారీకి కాలసిన ముడి సరుకులు కొనటం, వాటిని మాన్యు ఫాక్చరింగ్ చేయటం, కష్టమర్లు ఇన్‌స్పెక్షన్ చేయటానికి వచ్చినప్పుడు అన్నీ సవ్యంగా జరిగేటట్టు చూడటం, నాణ్యతతో పాటు చెప్పిన రోజుకి ఇవ్వగలగటం అంతా నా బాధ్యత. ఇటువంటివి నాటి నించీ ఈనాటి వరకూ చేస్తున్నవే. కాని అక్కడి పరిస్థితులు వేరు. మా మెషినిష్టులు వెల్డర్‌లూ మిగతా వర్కర్లూ అందరూ తెల్లవాళ్ళే. నూటికి నూరుపాళ్ళ పల్లెటూరి కౌబాయ్‌ల వంశపరంగా పరిశ్రమలలోకి వచ్చిన ఎర్ర జుట్టు తెల్ల మనుష్యులు. వాళ్ళని అమెరికాలో హార్డ్‌కోర్ రెడ్ నెక్స్ అంటారు. వాళ్ళల్లో చాలమంది కనీసం ఆరున్నర అడుగుల పొడుగు, కౌబాయ్ టోపీలు, పాము చర్మంతో చేసిన పెద్ద పెద్ద బూట్లూ, బెల్టులు. నేను చెప్పిన పని ఒకటీ చేసేవాళ్ళు కాదు. నన్నసలు పట్టించుకునేవాళ్ళు కాదు'

'మరేం చేసేవాళ్ళు? పని దెబ్బతింటే ఉద్యోగం పోతుంది కదూ' అడిగింది మోహన.

నేనూ నవ్వి 'అవును. అందుకే త్వరలో వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోయాను, వేరే ఒక విదేశీయుడిలా కాకుండా. మన అనే అభిమానం వున్నవాళ్ళకి అది ఏనాటికీ పోతుందని నేను అనుకోను. అందుకని ఆ 'మన'కి వాళ్ళ నిర్వచనం, తాత్పర్యం తెలుసుకోవటం అవసరం. మన శరీరపు రంగు, ఇంగ్లీషు భాష ఉచ్చారణా మార్చుకోలేము కనుక, మిగతా వాటి మీద దృష్టి పెడితే ఇది అంత కష్టం కాదు.. '

నా మాటకడ్డం వస్తూ అన్నాడు సుందర్. 'ఇది అంత సులభమూ కాదు..'

'అవును. అందుకే నాకు వాళ్ళల్లో కలిసిపోవటానికి దాదాపు నెలరోజులు పట్టింది. అంతా ఒకటై పోయాం. తరువాత ఏ గొడవలూ లేవు' అన్నాను.

'ఇక చాల్లెండి మీ భాగోతం... భోజనాలు రెడీ.. అంటున్నది శ్రీమతి, ఈ వ్యాసాన్ని ఇంతటితో ఆపమని సూచిస్తూ.